తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం

- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం
- వాడవాడలా అవగాహన ర్యాలీలు
- గర్భిణులు, బాలింతలకు వైద్యుల సూచనలు

ముంచంగిపుట్టు: జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యులు తల్లిపాల వల్ల శిశువు ఆరోగ్యానికి కలిగే ఉపయోగాలను వివరించారు.

ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ గీతాంజలి మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఏ ఇతర ద్రవపదార్థాలు తాగించకూడదన్నారు.బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు.ముర్రుపాలలో తగిన పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయని, అవి శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచుతాయన్నారు. శిశువుకు పాలు పట్టించే విధానాన్ని వివరించారు. వైద్యాధికారులు సంతోష్, ధరణి, హెడ్ నర్స్ సింహచలం, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు



రాజేంద్రపాలెంలో నిర్వహించిన అవగాహన ర్యాలీల్లో పాల్గొన్న సీడీపీవో విజయకుమారి తదితరులు



జీకే వీధిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ పీవో దుర్గా వరలక్ష్మి, సిబ్బంది

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా సీడీపీవో విజయకుమారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. దీని వలన శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం రావణాపల్లిలో బాలింతలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. తల్లిపాలు ప్రాధాన్యతపై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. వైద్యుడు మనోజ్ఞ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీత, కొండమ్మ, మహాలక్ష్మి, బాలామణి, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టత, ప్రాధాన్యతపై ఐసీడీఎస్ పీవో దుర్గా వరలక్ష్మి వివరించారు. సూపర్‌వైజర్లు వలసలమ్మ, రామలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని తులసిపాక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరీ మాట్లాడుతూ తల్లులు తమ పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో ప్రాముఖ్యమైనవని, ఆరోగ్యమైనదన్నారు. శిశువు ఆకలి గ్రహించి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పాలు అందించాలని ఆమె సూచించారు. వైద్యాధికారి నిఖిల్, సూపర్‌వైజర్ సత్యవతి, కో–ఆర్డినేటర్ రాజు, సరోజినీ, లత పాల్గొన్నారు.



చింతూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

గ్రామంలోనే బడి ఏర్పాటుచేయండి



తాళ్లపాలెంలో గ్రామస్తులతో ఎంఈఓ సూరయ్యరెడ్డి

రాజవొమ్మంగి: మా గ్రామానికి చెందిన ఆశ్రమోన్నత పాఠశాలలను తిరిగి మా గ్రామంలోనే నడపాలని తాళ్లపాలెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం గురువారం గ్రామానికి వెళ్లిన ఎంఈవో సూరయ్యరెడ్డికి గ్రామస్తులు తమ అభిప్రాయాన్ని ముక్తకంఠంతో తెలియజేశారు. వివరాల్లోకి వెళితే ఈ గ్రామంలోని ఆశ్రమోన్నత పాఠశాలను దాదాపు ఐదేళ్ల క్రిందట రాజవొమ్మంగికి తరలించారు.

ఈ పాఠశాల నేటికి తాళ్లపాలెం ఆశ్రమోన్నతపాఠశాల పేరుతో (డైస్ కోడ్ నెంబర్ 28140400201) రాజవొమ్మంగిలో కొనసాగుతుందన్నారు. పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు సుమారు 80 మంది చదువుతున్నారు. ఇటీవల కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలసిన సర్పంచ్ బుజ్జమ్మ తదితర గ్రామస్తులు మా పాఠశాలను మా గ్రామంలోనే తిరిగి ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇవ్వడంతో అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంఈఓ సూరయ్యరెడ్డి విలేకరులతో అన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: విద్యుత్ లైన్లు మరమ్మతు పనుల నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎండి యూసఫ్ తెలిపారు. విద్యుత్ లైన్లు మరమ్మతులతో పాటు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడతామన్నారు. విద్యుత్ వినియోగదారులు పరిస్థితిని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతమి

ఎటపాక: మండలంలోని మద్దిగూడెం, పూసుగూడెం గ్రామాల్లో లక్ష్మీపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోయినప్పటికీ ఐదు కిలోమీటర్లు కాలినడకన డాక్టర్ గౌతమి వెళ్లారు. శిబిరాల్లో 68 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యభద్రతపై సూచనలు, సలహాలు అందించారు. 104, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

116 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతమ్

డుంబ్రిగుడ (అరకులోయటౌన్): మండలంలోని సొవ్వా దేముడువలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత క్యాన్సర్ ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 116 మందికి పరీక్షలు చేశారు. క్యాంప్ కో–ఆర్డినేటర్ కనకేశ్వరరావు, వైద్య సిబ్బంది, గిరిజనులు, పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సదానందం

హుకుంపేట: మండలంలోని మజ్జివలస గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు గురువారం మండల టీబీ సూపర్‌వైజర్ సదానందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఎక్కువగా ఉండడం, రాత్రి పూట జ్వరం రావడం, ఆకలిలేకపోవడం, బరువు తగ్గుతూ ఉండడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాల్లో కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షయ నిర్మూలనే లక్ష్యమన్నారు. హెచ్‌ఎం డి.నాగేశ్వరరావు, సిబ్బంది ఇంద్రావతి, రామునాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

వై.రామవరం: ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశాల మేరకు గురువారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లోని తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ పనులు చేశారు. ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, కోట పంచాయతీ కార్యదర్శి లోవరాజు ఆధ్వర్యంలో ట్యాంకులు శుభ్రం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జి.మాడుగుల: మండలంలో సొలభం గ్రామ సచివాలయం పరిధిలో గల ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లుతో గురువారం సీజనల్ వ్యాధులు– పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఐసరం హనుమంతరావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన సంభవించే వ్యాధుల పట్ల గిరిజన ప్రజలు అప్రమత్తగా ఉండాలని, ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా సంబంధిత వైద్య సిబ్బంది, పీహెచ్‌సీలను సంప్రదించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమతెరలు వినియోగించాలన్నారు. నిల్వ ఆహారం తీసుకోవద్దని, వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ హను, ఏఎన్‌ఎం లావణ్య, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



సొలభంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు

నిత్యావసర సరకుల పంపిణీ

మారేడుమిల్లి : మండలంలోని చావడీకోట పంచాయతీ పరిధిలోని బోడ్డుమానువీధి గ్రామానికి చెందిన కొండ్ల రాజయ్య ఇల్లు కురుస్తున్న వర్షాలకు బుధవారం రాత్రి కూలిపోయింది.ఇంట్లో సామగ్రి ధ్వంసమైంది. రాజయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మారేడుమిల్లి ఉప సర్పంచ్ బొడ్డేటీ వీరబాబు బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, వంట సామగ్రి, కురగాయలు పంపిణీ చేశారు. చావడికోట సర్పంచ్ సాధల ప్రేమ్‌కుమార్ రెడ్డి, పల్లాల లక్ష్మి భూపతి రెడ్డి, రాజ్ కుమార్ రెడ్డి, దూడ సుందర్ పాల్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ వీరబాబు తదితరులు

వ్యసనాలతో జీవితం నాశనం



హుకుంపేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాయిడు సిబ్బంది



కొయ్యూరులో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సీఐ సన్యాసినాయుడు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వ్యసనాలతో జీవితం నాశనమవుతుందన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రిన్సిపాల్ ఎ.వి.శ్రీనువాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రమేష్‌నాయుడు, కిరణ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల–1లో గురువారం జరిగిన కార్యక్రంలో గంజాయి, ఇతరత్రా మత్తు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను సీఐ వెంకటరమణ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను ఆయన వివరించారు. యువత అబ్దుల్ కాలం లాంటి వ్యక్తికి ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, హెచ్‌ఎం వి.బి.మూర్తి పాల్గొన్నారు.

మృతదేహం తరలింపునకు సాయం

కొయ్యూరు: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సాంబే లక్ష్మణరావు మృతదేహాన్ని స్వగ్రామం ఎం.మాకవరం తరలించేందుకు గిరిజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి కృషి చేశారు. దీంతో కేజీహెచ్ నుంచి మృతదేహాన్ని గురువారం తీసుకువచ్చారు. అనారోగ్యానికి గురైన లక్ష్మణరావు(35) గడచిన కొన్ని రోజుల నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించి మృతి చెందారు. అయితే ఆ సమయానికి లక్ష్మణరావు మృతదేహాన్ని తరలించేందుకు ట్రైబల్ సెల్‌కు చెందిన వాహనాలు లేవు.. ఈ విషయాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తెలయజేయగా, అంబులెన్స్ ఏర్పాటుకావడంతో లక్ష్మణరావు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్టు వరలక్ష్మి చెప్పారు. మృతుడి కుటుంబానికి కొండదొరల గిరిజన ఉద్యోగ సంఘం రూ.25 వేలు విరాళాలు సేకరించి అందజేసినట్టు ఆమె తెలిపారు.



లక్ష్మణరావు మృతదేహం వద్ద వరలక్ష్మి, బంధువులు

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ



బంగారంపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సీతయ్య



జీకేవీధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు



నెల్లిపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

కొయ్యూరు: జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ గురువారం జరిగింది. అధికారుల పర్యవేక్షణలో లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. మండలంలోని అంతాడ, బంగారంపేటలో పింఛన్ల పంపిణీని ఎంపీడీవో లాలం సీతయ్య పర్యవేక్షించారు. తొలిరోజు పింఛన్లు అందని వారికి రెండోరోజు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): మండలంలోని పింఛన్ల పంపిణీ సజావుగా జరిగినట్టు ఎంపీడీవో జయ ఉమా తెలిపారు. గురువారం పింఛన్లు అందని వారికి శుక్రవారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో ఉమా చెప్పారు.

గూడెంకొత్తవీధి: పింఛన్ల పంపిణీలో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా, ఏవైనా ఫిర్యాలు వచ్చినా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆయన కొందరు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.

గంగవరం : మండలంలోని గంగవరం, నెల్లిపూడి గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.శిరీషా విజయభాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అర్జున, జనసేన మండల అధ్యక్షుడు కె.సిద్దూ, సర్పంచ్‌లు అక్కమ్మ, రమణమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల గాయపడిన బీజేపీ నాయకుడు కె.రమేష్‌ను ఎమ్మెల్యే దంపతులు, టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించారు.

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం, నాయుడుపాకలు, రాజానగరం గ్రామాల్లో గురువారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పింఛన్ నగదు పంపిణీ చేశారు. గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఎల్లవరం పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుని పరిశీలించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మతం విజయభాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని పలు పంచాయతీల్లో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో వీర కిషోర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. అయా గ్రామాలోల మండల సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. పాత పంచాయతీ వీధిలో జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ బాబు, సర్పంచ్ జాకబ్, ఉప సర్పంచ్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: వరదను సైతం లెక్కచేయకుండా పింఛన్లు అందించి ఓ గ్రామపంచాయతీ కార్యదర్శి తన ఉద్యోగ ధర్మాన్ని పాటించారు. వీఆర్ పురం మండలం రామవరం పంచాయతీలో పలు గ్రామాలు జలదిగ్బంధనంలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు పింఛను అందించేందుకు వరదనీరు అడ్డంకిగా వుండడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి తాతారావు గురువారం పడవపై వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ములు అందచేశారు. వరదను సైతం లెక్కచేయకుడా ప్రాణాలకు తెగించి పింఛను సొమ్ములు అందచేసిన తాతారావు సేవలను పలువురు కొనియాడారు.

సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలి

రంపచోడవరం/గంగవరం : సామాజిక పింఛన్లను సకాలంలో పంపిణీ చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. రంపచోడవరం, గంగవరం గ్రామాల్లో గురువార ఆయన పర్యటించి, పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య, రంపచోడవరం ఎంపీడీవో హరికృష్ణ, గంగవరం మండల పరిషత్ పర్యవేక్షకులు సిద్ధేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

మౌలిక సదుపాయాల కల్పనకు వినతి

రంపచోడవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎఫ్‌ఎస్‌ఐ) రంపచోడవరం శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటిడిఏ కార్యాలయంలో గురువారం ఓ అధికారికి కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రాఘవ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చినటువంటి విద్యార్థులకు చదువుకోడానికి అనుగుణంగా ఉండే ఏకైక మార్గం ప్రభుత్వ వసతి గృహాలని చెప్పారు.

అలాంటి వసతి గృహాల్లో నేడు కనీసం మౌలిక సదుపాయాలు లేకుండా తాగడానికి మంచినీరు లేకున్నా కనీస శుభ్రత లేని పరిస్థితి ఉందన్నారు. రంపచోడవరంలో ఉన్నటువంటి ప్రభుత్వ వసతి గృహాల్లో వార్డెన్ సమయసాన్ని పాటించకుండా, అసలు వార్డెన్ ఉన్నారో లేరో అనే అయోమయ స్థితిలో విద్యార్థులందరూ ఉన్నారన్నారు. కాస్మోటిక్ చార్జీల గురించి విద్యార్థులకు కనీసం అవగాహన కల్పించాలన్నారు. తక్షణమే ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతులకు పరిహారం అందించాలి
- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: తుపాను వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశమయ్యారు.పంచాయితీల వారీగా తుఫాన్ వల్ల కలిగిన నష్టాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు మాట్లాడుతూ మండలంలో తుపానుతో కురిసిన వర్షాలకు గిరిజన రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని, పంటలు నీట మునిగి జలమయమయ్యాయన్నారు. మూగజీవాలు మృతి చెందాయని, గిరిజనుల ఇళ్లు నేలమట్టమై నిలువ నీడ కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తుపాను వల్ల మన్యంలో అపార నష్టం జరిగినా గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదన్నారు. బాధితులకు కనీసం నిత్యావసర సరకులు కూడా ప్రభుత్వం అందజేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నష్టాలపై ప్రత్యేక నిధులు విడుదల చేసి అందరిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నాయకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

మలేరియా నివారణకు పటిష్ట చర్యలు

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో గల జర్జుల పంచాయతీ పెద్దతమ్మెంగుల గ్రామంలో మలేరియా దోమల నివారణ మందు పిచికారీ వైద్య సిబ్బంది చేయించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లోని విధుల్లో మురుగునీరు, నీటి నిల్వలు, చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా మందు పిచికారీ చేసే సిబ్బందికి సహకారించాలని, ఇంటి బయట, లోపల పిచికారీ చేయించుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నిరోధించడానికి జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. దోమతెరలు కచ్చితంగా వినియోగించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దతమ్మెంగులలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది